పడకేసిన ‘ప్రత్యేక పాలన’

- రోడ్లపైనే మురుగు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం


కొండనాగుల మురుగుకాల్వలో..


బల్మూర్‌లోని ప్రధాన రహదారిపై మురుగు

బల్మూర్: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పడంతో సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో మండల కేంద్రం, కొండనాగుల, గోదల్, చెన్నారం, అనంతవరం, బాణాల, జీన్‌కుంట తదితర గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్యం నివారణ చర్యలు చేపట్టకపోవడంతో రోడ్లపై మురుగు పారుతోంది. నెలల తరబడి డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించక పోవడంతో దుర్గంధంతో దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు కంటితుడుపుగా నిర్వహిస్తుండటంతో లక్ష్యం అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లపైనే మురుగు..

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్లపైనే మురుగుపారుతోంది. దోమల బెడదతో గ్రామాల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పందులు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కంపువాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని వాపోయారు. ప్రత్యేకాధికారులు పంచాయతీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం



ప్రధాన రహదారిపై మురుగు పారుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దుర్గంధ వాసన భరించలేకపోతున్నాం. దోమల బెడద అధికంగా ఉంది. ప్రత్యేకాధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడటం లేదు.

–జంగ బాలయ్య, 8వ వార్డు బల్మూర్

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా సమస్యలు పరిష్కరించలేక పోతున్నాం. వర్షాల కారణంగా పనులు సక్రమంగా చేయడం లేదు. పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తాం. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తాం.

– రాఘవులు, ఎంపీడీఓ, బల్మూర్

స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేస్తాం


మాట్లాడుతున్న రోహిత్ రెడ్డి

మన్ననూర్: శ్రీశైలం–హైద్రాబాద్ ప్రధాన రహదారి అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం సరిహద్దు పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలలో భాగంగా వేగాన్ని కట్టడి చేసేందుకు గానూ స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు డీఎఫ్‌ఓ రోహిత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడుతూ మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి దోమలపెంట వరకు అభయారణ్యంలో సుమారు 60 కిలో మీటర్లు 765 జాతీయ ప్రధాన రహదారి విస్తరించి ఉందన్నారు. ప్రతి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. మన్ననూర్ వనమాలిక చెక్‌పోస్టుతో పాటూ మృగవాణి, దోమలపెంట అటవీశాఖ చెక్‌పోస్టులు, పాతాలగంగ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల నిఘా ఉంచినప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటంలేదన్నారు. ఇటీవల శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పర్యాటకులు వేల సంఖ్యలో అధికంగా తరలిస్తున్నారన్నారు. స్థానికులతో పాటు అటవీ సరిహద్దు ప్రాంతాలలో వన్యప్రాణులు పెద్దపులి, చిరుతలు, ఎలుగుబంట్లు, కనితి, జింకలు, చుక్కల దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు కనీసం రోడ్డు దాటే పరిస్థితి కూడా ఇబ్బందిగా ఉందని వివరించారు. నాలుగు రోజుల కిందట వటువర్లపల్లి గ్రామం సమీపంలో గుర్తు తెలియని వాహనం చుక్కల దుప్పిని ఢీ కొట్టంతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. వేగ నియంత్రణపై వాహనదారులకు అవగాహన కల్పించే ఏర్పాట్లతో పాటూ పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి రహదారి పొడుగున అక్కడక్కడ స్పీడ్ గన్స్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామని డీఎఫ్‌ఓ తెలిపారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: ‘అసంపూర్తిగా బీటీ రోడ్డు పనులు’ శీర్షికతో ఈ నెల 1న సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి బీటీ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పస్పుల నుంచి కోడేరు వరకు కంకర రోడ్డు పై డస్టు వేసి ట్యాంకర్ల నుంచి నీటిని పడుతున్నారు. బీటీ పనులు ప్రారభం కావడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.


రోడ్డుపై నీరు పోస్తున్న ట్రాక్టర్

వర్గీకరణ వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న కుర్రు విద్యార్థి సంఘం నాయకులు

లింగాల: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు సుప్రీంకోర్టు రాష్ట్రాలకు బాధ్యతను అప్పగించడం హర్షనీయమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏ, బీ, సీ, డీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని కుర్రు విద్యార్థి సంఘం నాయకుడు గాలేటీ కార్తీక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన మార్గాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాలేటీ కార్తీక్ మాట్లాడుతూ గిరిజనులలో ఉన్న ఉప తెగలకు ఏ,బీ,సీ,డీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కడ కూడా గిరిజన ఉప కులాలకు న్యాయం చేకూరలేదన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు కేటీ తిర్పతయ్య, గాలేటి మధు, పూజారి భాస్కర్, కావేటి విష్ణు, రవి, శేషు, మయూరి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం


కల్వకుర్తిలో పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేష్, జనార్దన్‌రెడ్డి


పోటీల్లో పాల్గొన్న కొల్లాపూర్ వాసులు

కల్వకుర్తిరూరల్: కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని చింతల కొండారెడ్డి ఫంక్షన్ హాల్‌లో 2వ జాతీయ స్థాయి ఓపెన్ టూ ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. పోకిరీల బెడద నుంచి అధికం అయ్యిందని యువతులు తప్పనిసరిగా కరాటేలో శిక్షణ పొందాలన్నారు. పోటీ నిర్వహించిన కరాటే మాస్టర్ కిరణ్ నాయక్‌ను అభినందించారు. నాయకుడు బందెల రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాంభూపాల్ రెడ్డి, గంగాధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: గద్వాల జిల్లా కేంద్రంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో సీనియర్స్ విభాగం పోటీల్లో కొల్లాపూర్ వాసులు ప్రతిభను కనబర్చారు. అండర్–74, అండర్ 80, అండర్ 58, అండర్–63 కేజీల విభాగాల్లో ఎన్మన్‌బెట్లకు చెందిన మంచాల ఉపేందర్, మొలచింతలపల్లికి చెందిన ముద్దం మల్లేష్, ఆంజనేయులు, అంకిరావుపల్లికి చెందిన చెనమోని భాస్కర్‌యాదవ్‌లు ప్రతిభ చాటారు. వారికి తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి మెడల్స్ బహూకరించారు.

నాణ్యమైన భోజనం అందించాలి


భోజనం పరిశీలిస్తున్న సంతోష్

వెల్దండ: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం వసతి గృహంలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులు ఉంటున్న గదులకు సక్రమంగా తలుపులు, కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రివేళల్లో దోమలు కుట్టడంతో సీజనల్ వ్యాధులు సోకి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు ఉన్నారు.

అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సదానందంగౌడ్

కల్వకుర్తిరూరల్: అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకుడు సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో 405 జూనియర్ కళాశాలల్లో 1654 మంది అతిథి అధ్యాపకులు 10 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు వీరందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కళాశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయలేదని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇంటర్ బోర్డు కమిషనర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు జూనియర్ లెక్చరర్ల రిక్రూట్‌మెంట్‌తో సంబంధం లేకుండా రూ. 42 వేల జీతం అందించి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.

మాల మహానాడు నాయకుల నిరసన



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న మాల మహానాడు నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం మాట్లాడుతూ భారత రాజ్యాంగం 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీలను విభజించే అధికారం సుప్రీంకోర్టుకు లేదన్నారు. రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల గవర్నర్ల ద్వారా పార్లమెంట్‌లో చర్చించిన తర్వాతే తీర్మానానికి అధికరణ ఉంటుందన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. హరిశ్చంద్ర, శ్రీను, శ్యామ్, సూరయ్య, నారాయణ, వెంకటస్వామి, రాములు, బాలస్వామి, రవి, విష్ణు పాల్గొన్నారు.

సూర్యదేవాలయాన్ని దర్శించుకున్న కృష్ణజ్యోతి

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవల వారం రోజుల పాటు యజ్ఞాలు నిర్వహించిన కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి మండలంలోని బలాన్‌పల్లి సూర్యదేవాలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేవాదాయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 2 ఎకరాల భూమి ఉందని, ప్రతిఏటా ఆరాధన, కల్యాణం, రథసప్తమి, వార్షికోత్సవాలు వంటి పూజా కార్యక్రమాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. దేవాలయ నిర్మాణం కోసం గ్రామస్తులం అంతా కలిసి ఇటీవల సమావేశం నిర్వహించుకొని ఎలా నిర్మాణం చేపట్టాలని చర్చించుకున్నట్లు చెప్పారు. తదితర విషయాలపై గంటపాటు గ్రామస్తులతో ముచ్చటించారు. గ్రామస్తులు అశోక్, వెంకటస్వామి, నర్సింహ, వెంకటరమణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఊర్కొండ: మండల కేంద్రంలో జడ్చర్ల కల్వకుర్తి జాతీయ రహదారిపై స్థానిక ఎస్‌ఐ వీరబాబు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలతో వాహనాలు నడపాలని సూచించారు. ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని కోరారు.

గుట్కా పాకెట్లు స్వాధీనం

కల్వకుర్తి టౌన్: పట్టణంలో గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్‌ఐ రామచంద్ర పేర్కొన్నారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం ఆదివారం పట్టణంలోని గాంధీనగర్‌లోని టీస్టీ పాన్‌షాప్ నిర్వాహకుడు ఉమర్ నుంచి రూ.2500 విలువ గల గుట్కా పాకెట్లను, సుభాష్‌నగర్‌లో ఎస్ఆర్ పాన్‌షాప్‌లోని హాజీ నుంచి రూ.1500 విలువ చేసే గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



కల్వకుర్తిటౌన్: పట్టణంలోని నిర్మల విద్యాలయంలో 10వ తరగతి 2006–07 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 17 సంవత్సరాల తర్వాత మిత్రులు కలవడంతో సంబరపడ్డారు. పాఠశాల గుర్తులను, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పిన తీరు, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 1987–88 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం సోమశిలలో కలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెన్నమ్మ, సోని, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి: మారేడుమాన్‌దిన్నె గ్రామానికి చెందిన బొలగం నాగమణి అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.28,500లు మంజూరయ్యాయి. ఆదివారం మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ బాధితురాలికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, రాములు, రేణుక, రాముడు, శివ, మైబూస్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పశువులు మృత్యువాత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మాచినేనిపల్లిలో విద్యుదాఘాతంతో 8 గేదెలు, ఒక ఆవు మృత్యువాత చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ బావులకు వెళ్లే విద్యుత్ తీగను గుర్తు తెలియని కొంత కట్ చేసుకొని మిగతాభాగాన్ని అలాగే వదిలేశారు. గ్రామానికి చెందిన నలుగురు రైతులకు సంబంధించిన గేదెలు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు తీగకు తగలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి గేదెలను పరిశీలించారు.

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి శ్రీశైలంకు సంబంధించిన పాడి ఆవు ఆదివారం వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మన్ననూర్: ఇందిరా క్రాంతి పథకం ద్వార మహిళా సమాఖ్యలలో 23 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న దినసరి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కొర్రపాటి సైదులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సర్క్యులర్ నంబర్ 216ను విడుదల చేస్తూ అప్పట్లో రెగ్యులర్ చేయాలని ఆదేశాలు కూడా జారీ చేయడంతో పాటు సర్టిఫికెట్లు కూడా వెరిఫికేషన్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పునః పరిశీలించి మహిళా సమాఖ్యలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణ కేంద్రంలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడుతూ గత నెలలో పార్టీ ఆధ్వర్యంలో అన్ని వార్డులలో సర్వే నిర్వహించి సమస్యలు గుర్తించామని పేర్కొన్నారు. బీసీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, స్తంభాలు, వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత బీఆర్ఎస్ పాలనలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో రోడ్లను తవ్వి నీళ్ళు బయటకు పోకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వార్డులలో రోడ్డు సగానికే వేసి వదిలేశారని, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రధానమైన నల్లవెల్లి రోడ్డుకు మరమ్మతు పూర్తి కాలేదని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, పొదిల రామయ్య, యాదయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల పోరాటానికి సహకారం అందించిన అన్ని వర్గాల ప్రజలకు, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, మల్లేష్, కాశీం, మహేష్, వెంకటేష్, సుదర్శన్, లాలయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్: అమ్రాబాద్ మండంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం పరామర్శించారు. మండలంలోని మొలకమామిడి గ్రామంలో మోటమారి బాలకిష్టయ్య, వెంకటేశ్వర్లబావి ఎలుకచేను ఎర్రయ్యలు ఐదు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా గ్రామాలకు ఎమ్మెల్యే వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కటకం శ్రీనివాసాచారి, నాయకులు దివాకర్, అంబనారాయణ, రేణయ్య, నవీన్, శ్రీనివాసులు, కర్ణ, జగాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానవాళి విముక్తికి మార్క్సిజమే మార్గం



నాగర్‌కర్నూల్ రూరల్: కార్మిక కష్టజీవులకు దోపిడి శక్తుల నుంచి విముక్తి జరిగేది మార్క్సిజం ద్వారానే అని సీపీఎం సీనియర్ జిల్లా నాయకులు అబ్దుల్లాఖాన్ అన్నారు. ఆదివారం స్టడీ సర్కిల్ కార్యక్రమాన్ని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్క్సిజం శాస్త్రీయ దృక్పథంలో ఉంటుందని, వర్గపోరాటాలకు దిక్సూచి అన్నారు. మతోన్మాదం ద్వారా ప్రజలు, కార్మికులు, కర్షకుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం పాలకవర్గం చేస్తుందని అన్నారు. కులం, మతం, ప్రాంతం లేని సమాజం మార్క్సిజం కోరుకుంటుందని, మానవాళి విముక్తికి మార్క్సిజమే మార్గమన్నారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, సి.ఆంజనేయులు, నర్సింహ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవ కార్యక్రమాలు విస్తరిస్తాం



అచ్చంపేట రూరల్: సేవ కార్యక్రమాలు విస్తరిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోక్తాల వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మధుమేహ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 150 మంది వాకర్స్‌ను పరీక్షించారు. తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పరీక్షించిన వైద్యులు లింగాచారి, వెంకటేష్, లింగారెడ్డి, కిష్టయ్యగౌడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేష్, సెక్రటరీ శ్రీనివాస్, కోశాధికారి శివశంకర్, శ్రీనివాస్, నర్సింహారావు, చంద్రకుమార్, నరేష్, గణపతి పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు ప్రశంసనీయం

కల్వకుర్తిరూరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. పట్టణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్మన్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 412 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్లు గుబ్బ రాజేశ్, సాయిచరణ్, చంద్రకాంత్, సింధూ, సౌమ్య, శ్రీధర్ ఉన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా వేణుచారి



కల్వకుర్తిరూరల్: స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేణుచారి ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో వేణుచారి విజయం సాధించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రవీంద్రాచారిలు వేణుకు నియామక పత్రం అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమేష్ చారి, ఎన్నికల అధికారులు యాదగిరాచారి, జగన్‌మోహన్‌చారి, ఆంజనేయులు, దక్షిణామూర్తి, శ్రీనివాసాచారి, రమేష్ బాబు, దయాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడు రవినాయక్‌కు సన్మానం

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాకు చెందిన నేనావత్ రవినాయక్ ఇటీవల బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు, జిల్లా నాయకులు రాఘవేందర్ గౌడ్, బుసిరెడ్డి, దుర్గ ప్రసాద్, నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. ప్రధాని పిలుపు మేరకు జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తిని పెంపొందించాలన్నారు.

ఉపాధ్యాయులకు..

బల్మూర్: మండల కేంద్రంలో ఇటీవల పదోన్నతి పొందిన దళిత ఉపాధ్యాయులను ఆదివారం స్థానిక అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. జీహెచ్ఎం డి.బాలస్వామి, ఎస్ఏలు వెంకట్‌నారాయణ, బస్వయ్య, విజయ, పీఈటీ డైరెక్టర్ ఏ.బాలయ్య, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం తిరుపతయ్యలను పూలమాలతో సత్కరించారు. కొండనాగుల గ్రామానికి చెందిన డా.దాసరి మౌలాలీ రెండో పీహెచ్‌డీ పట్టా పొందడంతో శుభాకాంక్షలు తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, సంఘం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఖదీర్, మాజీ సర్పంచ్ శివశంకర్, సభ్యులు శ్రీనువాసులు, శ్రీహరి, నరేష్, పర్వతాలు, బాల్‌రాజు, పర్వతాలు, నాగయ్య, వెంకటయ్య, ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.